ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 02.11.2025 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎం.ఐ.ఎం పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.
2. హైడ్రా సంపన్నులను వదిలి పేదల నివాసాలు కూల్చేస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు.
3. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఈ సాయంత్రం ప్రయోగించనుంది.
4. ఈ రోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------------

**మార్నింగ్ వాక్**

కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎం.ఐ.ఎం పార్టీలు కుమ్మక్కు రాజకీయాలతో ప్రజల అభివృద్ధికన్నా తమ రాజకీయ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ విషయం ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా అర్థం అవుతోందని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ఉదయం యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్క్ లో కేంద్రమంత్రి మార్నింగ్ వాక్ చేపట్టారు. వాకర్స్ తో సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నర

సంవత్సరాల పాటు బీఆర్ఎస్, గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజల్ని మోసం చేసాయన్నారు.

**పీఎస్**

----------------------------------

**కాంగ్రెస్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కృష్ణకాంత్ పార్క్ లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు మార్నింగ్ వాక్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేసి గెలిపించాలని వాకర్స్ కు వారు విజ్ఞప్తి చేశారు.

**పీఎస్**

---------------------------

**కేటీఆర్**

హైడ్రా పెద్దవాళ్లని వదిలిపెట్టి పేదవాళ్ళ నివాసాలు కూల్చేస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ భవన్ లో హైడ్రా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బాధ అందరికీ తెలియాలని ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. పెద్దవాళ్లకు హైడ్రా నోటీసులు ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నించారు.

**డెస్క్**

-------------------------

**సీట్లు**

రాష్ట్రంలోని పీజీ వైద్యవిద్య కాలేజీల్లో యాజమాన్య కోటాలో ఇకపై తెలంగాణ విద్యార్థులకే 85 శాతం సీట్లు కేటాయించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేసిన విజ్ఞప్తితో స్థానిక విద్యార్థులకు మేలు జరిగేలా ఉత్తర్వులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో జీవో జారీ చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో, కాళోజీ యూనివర్సిటీ నిర్వహించనున్న పీజీ కౌన్సెలింగ్‌లో ఇకపై యాజమాన్య కోటాలో రాష్ట్ర విద్యార్థులకు అదనంగా

318 మెడికల్ పీజీ, 70 డెంటల్ పీజీ సీట్లు దక్కుతాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై జూనియర్ వైద్యుల సంఘం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేసింది.

**డెస్క్**

--------------------------

**డీపీఆర్**

తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు నీటిని మళ్లించే పనులకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 11.88 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా నిన్న ఆదేశాలు జారీ చేశారు.

**డెస్క్**

------------------------------

**సమీక్ష**

వ్యవసాయ శాఖ పరిధిలోని పలు అనుబంధ కార్పొరేషన్ల పనితీరు, స్థితి గతులపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు నిన్న సచివాలయంలో సమీక్షనిర్వహించారు. నిరర్ధకంగా మారిన కార్పోరేషన్ ల పునరుద్ధరణపై కార్యాచరణ రూపొందించాలని, పని విధానం పరిమితులపై కసరత్తు వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్పోరేషన్ ల ఆర్థిక పరిస్థితి, అప్పులు, ఆస్తులపైనా పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని కూడా మంత్రి ఆదేశించారు.

**డెస్క్**

--------------------

**ఉజ్వల**

ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో తమకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ వచ్చిందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లబ్ధిదారు దురిశెట్టి మౌనిక చెప్పారు. ఆకాశవాణితో ఆమె మాట్లాడుతూ...

**బైట్ - మౌనిక**

**పీటీసీ సిరిసిల్ల**

-----------------------------

**ఇస్రో**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ సాయంత్రం దేశంలోనే అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం CMS-03 ను ప్రయోగించనుంది. ఈ ప్రయోగం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి భారత ప్రామాణిక సమయం ప్రకారం సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు జరుగుతుంది. CMS-03 అనేది బహుళ-బ్యాండ్ మిలిటరీ కమ్యూనికేషన్ ఉపగ్రహం, దీనిని GSAT-7R అని కూడా పిలుస్తారు. ఇది దేశంలోనే అత్యంత శక్తివంతమైన రాకెట్ అయిన లాంచ్ వెహికల్ మార్క్ 3 (LVM3) పై ప్రయోగిస్తున్నారు. ఇది భారత భూభాగంతో సహా విస్తృత సముద్ర ప్రాంతంలో సేవలను అందిస్తుందని ఇస్రో తెలిపింది. ఈ ఉపగ్రహం నావికాదళానికి కనెక్టివిటీని గణనీయంగా పెంచుతుంది.

**ఎస్ఎస్డీ**

-----------------------------

**మెట్రో**

హైదరాబాద్ మెట్రో రైలు సమయాల్లో రేపటి నుంచి స్వల్పంగా మార్పు చేసినట్లు ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించింది. ప్రతిరోజు అన్ని టెర్మినల్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి రైలు బయలుదేరుతుందని, రాత్రి 11 గంటలకు చివరి మెట్రో రైలు సర్వీసు ఉంటుందని తెలియజేసింది.

**డెస్క్**

-------------------------

**యాదాద్రి**

పవిత్ర కార్తీక మాసంలో వారాంతం కావటంతో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. తెల్లవారు ఝాము నుంచే భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తూ, కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ధర్మ

దర్శనానికి సుమారు 2 గంటలు, ప్రత్యేక దర్శనానికి గంటన్నర సమయం పడుతోంది. క్యూలైన్లలో ఉన్న భక్తులకు తాగునీరు, విశ్రాంతి కోసం ప్రత్యేక షెడ్లు, వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు దేవాలయ అధికారులు తెలియజేశారు.

**పీటీసీ - యాదాద్రి**

------------------------

**వాతావరణం**

గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 3 సెంటీమీటర్లు, మంచిర్యాల జిల్లాలో 2 సెంటీ మీటర్లు, రాజన్నసిరిసిల్ల, నల్గొండ, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో 1 సెంటీమీటర్ చొప్పున వర్షం కురిసిందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఈరోజు కూడా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

**పీఎస్**

-------------------------

**యాక్సిడెంట్**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ జాతీయ రహదారిపై ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ముగ్గురు గాయపడ్డారు. వేగంగా వస్తున్న మహేంద్ర థార్ వాహనం అదుపుతప్పి డివైడర్ను ఢీకొంది. అనంతరం రోడ్డుపక్కన నిల్చొని ఉన్న యువకుడు, యువతిపైకి దూసుకెళ్లింది. ఢీకొట్టిన బలానికి యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే సమయంలో యువతి రహదారికి ఆనుకుని ఉన్న చెరువులో పడిపోయి మృతి చెందింది.

**పీటీసీ - యాదాద్రి**

----------------------

**ప్రసార భారతి**

ప్రసార భారతి, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో, ఈ నెల 29 వరకు దేశవ్యాప్తంగా 24 కేంద్రాలలో 67వ ఆకాశవాణి సంగీత సమ్మేళనాన్ని నిర్వహించనుంది. 1954లో

ప్రారంభమైనప్పటి నుండి, ఆకాశవాణి సంగీత సమ్మేళనం భారతదేశంలో అత్యంత శాశ్వతమైన, గౌరవనీయమైన సాంస్కృతిక సంప్రదాయాలలో ఒకటిగా నిలుస్తోందని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలియజేసింది. COVID-19 మహమ్మారి కారణంగా స్వల్ప అంతరాయం తర్వాత ఈ ఉత్సవం ఈ సంవత్సరం పునరుద్ధరించిన ఉత్సాహంతో తిరిగి వస్తోందని ప్రసార భారతి సిఇఒ గౌరవ్ ద్వివేద్ అన్నారు.

**NSD**

------------------------------

**లోక్ అదాలత్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోర్టుల్లో ఈనెల 15వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ ను నిర్వహించనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సిరిసిల్ల, వేములవాడ కోర్టుల్లో ప్రత్యేక లోక్అదాలత్ ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఎన్ యాక్ట్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, మోటార్ వాహనాల కేసులు, పెండింగ్ లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

**పీటీసీ - సిరిసిల్ల**

---------------------------

**లోక్ అదాలత్**

వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయస్థానం పరిధిలో ఈనెల 15వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించనున్నారు. దీనిని విజయవంతం చేయాలని వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు విబి నిర్మల గీతాంబ, డా. పట్టాభి రామారావు.. కక్షిదారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులను ఒక ప్రకటనలో కోరారు. మొంథా తుఫాను బాధితుల సహాయం కోసం న్యాయ సేవాసదన్ లో రేపు హెల్ప్ డెస్క్ ప్రారంభించనున్నట్టు వారు పేర్కొన్నారు.

**పీటీసీ - వరంగల్**

---------------------------

**షీ టీమ్**

మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైనప్పుడు ధైర్యంగా  పోలీ సులను సంప్రదిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మహేష్ బీ గితే ఒక ప్రకటనలో తెలిపారు.  జిల్లాలోని  విద్యాసంస్థల్లో, మహి ళలు పని చేసే ప్రదేశాల్లో షీటీమ్ బృందం ఆధ్వర్యంలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

**పీటీసీ - సిరిసిల్ల**

----------------------